


# కౌంటర్ ఫీట్

## కె. గోదావరి శర్మ

పరాకుగా నడుస్తున్న పార్వతీశం కాళ్ల హఠాత్తుగా ఆగిపోయాయి కళ్ల రోడ్డు మీద పడిఉన్న ఏదో అసాధారణ వస్తువుని చూశాయి, వెంటనే దాన్ని హస్తగతం చేసుకోవాలని మెదడు చేతులకి సందేశం పంపింది. అనాలోచితంగానే గబుక్కున వంగి దాన్ని తీయబోతూ ఉండగా హఠాత్తుగా ఏదో గుర్తొచ్చింది పార్వతీశానికి. కాని అప్పటికే అప్రయత్నంగా నడుం వంగి, చెయ్యి సాగి, రోడ్డుమీద మడతపడి ఉన్న ఆ నోటుని అందుకుంది. అలా వంగునే తలతిప్పి ఎడమపక్కకి చూశాడు. అంతవరకు నోటికి చెయ్యి అడ్డంపెట్టుకుని నవ్వు ఆపుకుంటున్న అల్లరిపిల్ల తుర్రువ ఇంట్లోకి పారిపోయింది.

పార్వతీశం ఒక్క క్షణంపాటు ఇబ్బల్డ్ ఫీలయ్యాడు. వారం రోజుల క్రిందట ఒకసారి ఇదే పరాభవం జరిగింది అది గుర్తురాగానే ఆ నోటుని అదేదో అంటరాని వస్తువైనట్టు విడిలించి పారేసి, విటారుగా నిలబడి, వెనక్కి తిరిగి చూడకుండా చకచక ముందుకి సాగిపోయాడు.

కొద్దిసేపట్లో అతడికి ఆ పిల్లమీద కోపం పోయింది. తన పరధ్యానానికి తెలివితక్కువకి తనకే నవ్వు వచ్చింది. ఒట్టి అల్లరిపిల్ల! తను ఉండే వీధిలోనే చివరి ఇంట్లో ఉంటున్నారు వాళ్లు

ఆ రోజు ఇలాగే —ఏదో ఆలోచిస్తూ నడుస్తున్న తను రోడ్డుమీద కాళ్ళకడ్డంగా పడిఉన్న ఐదు రూపాయల నోటు మడతని చూసి ఆగిపోయాడు. పాపం, ఎవరో పారేసుకుని ఉంటారు! పొద్దున్నే లేచి తను ఎవరిముఖం చూశాడో ఎవరిదో ఏమిటి? తన ధర్మపత్ని ముఖమే — ఆ అదృష్టహీనుణ్ణి విడనాడిన లక్ష్మి తనని వరించింది నెలాఖరు రోజుల్లో అయాచితంగా దొరికిన ఐదురూపాయలు ఏ ఖర్చుకైనా పనికొస్తాయి అనుకుంటూ వంగి దాన్ని తీశాడు. తీరా పైకితీసి దాన్ని పరీక్షగా చూస్తే అది పిల్లలు ఆడుకునే బొమ్మనోటు. జాగ్రత్తగా చూడకపోతే ఎవరైనా పొరపాటు పడతారు. ఏ కిళ్ళీ షాపులోనైనా ఐదుపైసలకొకటి దొరుకుతాయి అలాంటి బొమ్మనోట్లు.

ఒక్కసారి నిరుత్సాహం ముంచుకురాగా ఆ దొంగనోటు నేలకి విసరికొట్టి, తన తొందరపాటు పనిని ఎవరైనా మాశారేమోనని చుట్టూ చూశాడు. ఎడమపక్క ఇంటి గేటుదగ్గర - సన్నజాజి పందిరి క్రింద నిలబడి తనకేసే చూస్తూంది ఒక పన్నెండేళ్ళ పాప. అవతలి వాళ్ళలోవి దురాశని ఎక్స్ప్లాయిట్‌చేసి ఇలా ఆటలు పట్టించి నవ్వుకోవడంలో ఒక ఆనందం ఉంది ఆ ఆనందం ఆ పిల్ల కళ్ళలో స్పష్టంగా కనిపించింది. తను ఆ పిల్లకేసి చూడగానే ఏం ఎరగనట్టు అమాయకంగా ముఖంపెట్టి కొబ్బరిచెట్టు చాటుకి తప్పుకుంది చెట్టువారకి వెళ్ళి తనని తలచుకుని నవ్వుకుందేమో! ఇవాళ లాగే

ఆ రోజు మొదటిసారి అలా మోసపోవడం తనూ సరదాగానే తీసుకున్నాడు. ఆ పిల్ల చేసిన కొంటెపనిని భార్యకి చెప్తే నవ్వుతుందని, తనని ఎగతాళిచేస్తుందని ఆమెకి మాత్రం చెప్పలేదు. అయినా, అందులో తనకి జరిగిన అవమానం ఏమీ లేదని సమర్థించుకున్నాడు. ఎదురుగా నోటు కనిపిస్తే ఎవడి మనసు ఆశపడకుండా ఉంటుంది?

కాని మళ్ళీ అదే పద్ధతిలో ఫూల్ అవడం బాగులేదు. పైగా ఈసారి ఆ పిల్ల తన ఎదురుగానే నవ్వింది. తన పరధ్యానానికి తనని తను మళ్ళీ తిట్టుకున్నాడు పార్వతీశం. ఇంటి మెట్లెక్కుతూ ఈ

విషయం మరచిపోవడానికి ప్రయత్నించాడు

ఆటు తర్వాత ఆ ఇంటిముందునుంచి ఆఫీసుకి వెళ్తున్నా వస్తున్నా, అక్కడికి వచ్చేసరికి ఆ సంఘటన గుర్తువచ్చేది పార్వతీశానికి వెంటనే మనిషి ఇంకేం ఆలోచించకుండానే ఎలర్ట్ అయిపోయేవాడు. రోడ్డుమీద ఏ వస్తువునీ చూడకుండా, చూసినా, పట్టించుకోకుండా, పట్టించుకున్నా ఆగి, వంగి, తీసే బుద్ధి తక్కువపని చేయకుండా బుద్ధిగా ముందుకి నడిచి వెళ్ళిపోయేవాడు ఆ అమ్మాయి అక్కడ ఉందేమోనని మాత్రం ఓసారి గేటువైపు చూశాడు. ఒకటి రెండు సార్లు కనిపించింది నొచ్చుకున్నట్టుగా, సారీ చెప్తున్నట్టుగా చూసింది కూడా. పార్వతీశం ఏమైనా అవకాశం ఇస్తే, 'సారీ అంకుల్, ఇంకెప్పుడూ అలా చెయ్యను' అని చెప్పేఉండేదేమో కూడా! ఏమైనా రోజూ ఆ ఇంటికేసి, ఆ పాప కోసం ఓసారి చూడడం అలవాటైపోయింది పార్వతీశానికి

దాదాపు నెల్లాళ్ళ గడిచిపోయాయి. ఈ మధ్యలో, ఆ పాప చురుకైనదీ, తెలివైనదీ అని చూపులద్వారానే గ్రహించాడు పార్వతీశం. మాట్లాడే అవసరం, అవకాశం మాత్రం కలగలేదు.

ఓ రోజు సాయంకాలం ఆఫీసునుంచి అలసిపోయి ఇంటికి తిరిగివస్తున్నాడు పార్వతీశం. ఆఫీసు పనివల్ల తలనొప్పిగా, ఒళ్ళంతా చెమటపట్టి, చికాగ్గా ఉంది. నీరసంగా ఇంటికేసి అడుగులు వేస్తున్న పార్వతీశానికి మళ్ళీ రోడ్డు ప్రక్కగా దాదాపు అదేచోట ప్రత్యక్షమైంది నోటు. ఈసారి వందరూపాయల నోటులా ఉంది! గేటుకేసి చూశాడు. ఆ పాప లేదు ఏ కొబ్బరిచెట్టు చాటునో, కిటికీ వెనకో ఉంటుంది. పార్వతీశానికి ఈ ఆట ఇక ఆసక్తి అనిపించలేదు. ఆ నోటువంక నిర్లక్ష్యంగా ఓసారి చూసి నడక సాగించాడు.

ఇల్లు చేరిన పార్వతీశానికి భార్య ముందుగదిలో దిగాలుగా కూర్చుని కనిపించింది. తలనొప్పినీ, చికాకునీ వాయిదా వేసి, లేని ఉత్సాహం తెచ్చిపెట్టుకుని "ఏం, అలా కూచున్నావేం?" అనడిగాడు.

"ఏమండీ, ఏమీ అనకండేం! నా తప్పేంలేదు, నేను జాగ్రత్తగానే ఉన్నాను. అయినా " వీళ్ళు నమిలింది భార్య.

పార్వతీశానికి ఆందోళన, ఆతృత హెచ్చాయి.

"ఏమైంది, ఇంతకీ? ఇంట్లో ఏదైనా.. పోయిందా? పగిలిపోయిందా— అద్దంగానీ .."

"ఊహూఁ! ఆ మాత్రం అయితే బాగానే ఉండును. ఇందాక బియ్యం తెద్దామని బజారు కెళ్ళానండీ! ఉదయం చెప్పానుగా, వెళ్తానని.... వెళ్తూ ఉంటే—

పార్వతీశం బుర్రలో ఫ్లాష్‌లా ఏదో మెరిసింది.

"కొంపతీసి—ఉదయం నేను బీరువాలో ఉంచిన వందరూపాయల నోటు తీసుకెళ్ళావా?" అనడిగాడు.

"ఊఁ! అదే...." భయం భయంగా అంది ఆమె.

"అది పోయిందా, ఎక్కడో? జారి పోయిందా చేతిలో మడిచి పట్టుకుంటే?"

"ఊఁ! మీకెలా తెలుసు?" ఆశ్చర్యంగా అడిగింది.

"ముందు బయలుదేరు. తాళం కప్ప ఏదీ? తలుపుకి వేసి రా, చెప్తాను. అర్జెంటు...." త్వర పెట్టేడు పార్వతీశం.

అతడి భార్యకి వెంటనే లైటు వెలగ లేదు. "ఎక్కడికండీ" అంది అర్థంకాక.

"దార్లో చెప్తాను, నువ్వు బయలుదేరు ముందు. లేటుచేస్తే అదెవడో కొట్టేస్తాడు.... అసలు ఇప్పటికే ఎవడికంటో పడేఉంటుందది" ఆదుర్దాగా అన్నాడు పార్వతీశం.

"ఉందా? ఆ నోటు మీరు చూశారా?" అయోమయం, ఆనందం కలగలిపిన స్వరంతో అడిగింది ఆమె.

"చూశాను. ఇందాక అక్కడే రోడ్డు పక్కన పడిఉంది. ఇప్పటికింకా ఉందో ఎవడైనా తీసుకున్నాడో...." తాళంవేసి బయటకి నడుస్తూ అన్నాడు పార్వతీశం.

"మరి చూస్తే తియ్యలేదేమండీ?" ఇంకా అయోమయంగా అడిగింది ఆమె.

"రోడ్డుమీద వందరూపాయల నోటు కని పిస్తే చూసి, ఓహో అనుకుని వచ్చేశారా? లేకపోతే అది మనది కాదుకదా, ఇంకెవరిదో మనకెందుకని వదిలేశారా, సత్య హరిశ్చంద్రుడిలా?"

పార్వతీశానికి భార్యమీద, తనమీద, ఆ పాపమీద ఒకేసారి కోపం వచ్చింది. దాన్తో తలనొప్పి ఎక్కువై, ఆ గందర గోళంలో విషయమంతా వివరించడానికి వ్యవధి, ఓపిక లేక, "నువ్వు కొంచెం నోరు మూసుకుంటావా" అన్నాడు అసహనంగా.

ఆమె తెల్లబోయి చూసింది. పరుగు లాంటి నడకతో అతడు వెళుతూంటే అతడి వెనకే ఆమెకూడా వెళ్ళింది.

ఆ ఇంటిముందు రోడ్డుమీద, రోడ్డు ప్రక్కనా జాగ్రత్తగా వెతికారు దంపతు లిద్దరూ. ఫలితం శూన్యం. ఈ అదృష్ట హీనుల్ని విడిచిపెట్టి లక్ష్మి ఇంకే అదృష్ట వంతుడినో అప్పుడే చేరుకుంది. చీకటి ముదిరాక ఇంక లాభంలేదని నిర్ణయానికి వచ్చారు ఇద్దరూ.

"ఇంక మరి దొరకదు పోదామండీ" అంది భార్య దీనంగా. ఇంతకీ అది ఇక్కడే పడిఉంటే భర్త దాన్ని చూసి కూడా ఎందుకు తియ్యలేదో ఆమెకి అంతుపట్టలేదు.

పార్వతీశం కూడా నిరాశ చేసుకుని, వెనుతిరగబోతూ, "ఒక్క నిముషం" అన్నాడు, ఆ ఇంటికేసి అడుగేస్తూ. అంతసేపూ ఆ ఇంటిగేటు మూసుకునే ఉంది.

"ఆ ఇంటివాళ్ళకేమైనా దొరికిందేమో ననా?" అడిగింది ఆమె.

"ఊహూఁ!" ఏరేమీ చెప్పకుండా గేటు తీసుకుని లోపలికి వెళ్ళి, గుమ్మం పక్కగా ఉన్న కాలింగ్‌బెల్ నొక్కాడు పార్వతీశం.

తలుపు తీసుకుని ఆ పాప తల్లి కాబోలు, ఆవిడా, వెనకనే ఆ పాపా వచ్చారు.

పార్వతీశం డైరెక్ట్‌గా ఆ పాపనే అడిగాడు. "ఏం పాపా! ఇవాళ కూడా నన్ను ఫూల్ చేద్దామనుకున్నావా!"

శ్రోతలు ముగ్గురికీ ఆ ప్రశ్న అర్థం కాలేదు.

"అదేఁటండీ" అంది ఆ పాప, అయోమయంగా, కొంచెం భయంగా.

"అదే.... ఇవాళ కూడా బొమ్మనోటు రోడ్డుమీద పడేసి, నేనది తీసి ఫూల్‌నైతే చూసి నవ్వుదామని ట్రైచేశావా," మృదువుగానే అయినా, సూటిగా అడిగాడు పార్వతీశం.

"లేదండీ! గాడ్ ప్రామిస్! ఇవాళ నాకు జ్వరం. సాయంకాలం అస్సలు బయటకే రాలేదు. ఇంతకుముందు అలా చేసినందుకు సారీ అండీ, రియల్లీ సారీ!– ఇవాళ మాత్రం నేనేం చెయ్యలేదు." ఆ పాప ముఖం దీనంగా ఉంది.

పార్వతీశం నిట్టూర్చాడు. "అయితే ఆ నోటు మనదే. నిజం నోటే అన్న మాట...." అన్నాడు భారంగా.

ఆడవాళ్ళిద్దరికీ ఇంకా విషయం బోధ పడలేదు. పాపకి మాత్రం అర్థం అయింది. వెంటనే అవాక్కై తర్వాత ఏదో అనబోయింది.

కాని ఇంతలోనే పార్వతీశం "వస్తా మండీ. సారీ ఫర్ ది డిస్టర్బెన్స్" అని పాపా వాళ్ళమ్మతో చెప్పి వెనుతిరిగేడు. అతడి భార్య అతడిని అనుసరించింది.

—౦—